


కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎవరు?



- రేసులో వెలిచాల, అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి
- అసంతృప్తిలో పాత కాంగ్రెస్ నేతలు
- పారాష్యూట్ నేతలకు పదవులా.. అంటూ ఆగ్రహం
- గాంధీభవన్‌కు వెళ్లేందుకు ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

జిల్లా రాజకీయాలకు కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం కీలక కేంద్రం. అన్ని పార్టీల రాజకీయాలకు ఇదే కేంద్రబిందువై ముందుకు నడిపిస్తుంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఇక్కడ ఇన్‌చార్జి లేకుండా పోయాడు. కాంగ్రెస్‌కు జిల్లా అధ్యక్షుడిని నియమించ డంలో పార్టీ అధిష్ఠానం కొద్ది నెలలుగా తర్జనభర్జన పడుతున్నది. ఇప్పుడు నియోజకవర్గానికి కూడా ఇన్‌చార్జి లేకుండా పోయాడు.

● 'పురుమల్ల' సస్పెన్షన్‌తో..

కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఇక్కడ పోటీచేసి ఓడిపోయిన పురుమల్ల శ్రీనివాస్ వ్యవహరిస్తూ వస్తున్నారు. ఆయన ఆ పదవిలో ఉన్నా ఆయన మాట ఏది చెల్లుబాటుకాక ఆయన పంపిన ఏ ప్రతిపాదనకు ఆమోదముద్ర పడక ఉత్సవ విగ్రహంలా ఉండాల్సి వచ్చింది. దీంతో ఆయన తీవ్ర అసంతృప్తికిలోనై అందుకు కారణం జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ అంటూ పలు సందర్భాలలో బాహటంగా, సమావేశాల్లో పరోక్షంగా వ్యాఖ్యానిస్తూ వచ్చారు. సమావేశాల్లో ఆయన మాట్లాడిన మాటలు ఆన్‌ది రికార్డు కావడంతో ఈ నియోజకవర్గానికే చెందిన కొందరు నేతలు అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. దీంతో షోకాజ్ నోటీస్ ఇచ్చి ఆయన ఇచ్చిన జవాబుతో సంతృప్తి చెందక టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సస్పెన్షన్ వేటు వేసింది. ఆయన ఇంకా కాంగ్రెస్‌లో తన కథ ముగిసిపోలేదని, త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి కాంగ్రెస్‌లో తన రాజకీయ భవిష్యత్ ఏమిటో చర్చించిన తర్వాత అసలు కార్యాచరణ ప్రకటిస్తానని, ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నానని చెబుతున్నారు. ఆయన ప్రయత్నాలు అలా కొనసాగుతుండగా మరికొందరు నేతలు మాత్రం నియోజకవర్గ ఇన్‌చార్జి పదవిలోకి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

● ఎవరికి వారే ప్రయత్నాలు

కరీంనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా ఎంపీ స్థానంలో పోటీ చేసి పరాజయంపాలైన వెలిచాల రాజేందర్‌రావు, పట్టభద్రుల నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి పేర్లు తెరపైకి వస్తున్నాయి. రాజేందర్‌రావు ఇంతకాలం డీసీసీ అధ్యక్ష పదవికోసం పోటీపడుతూ వచ్చారు. ఆ పదవి వ్యవహారం ఎటూ తేలకపోవడంతో దాంతోపాటు ప్రస్తుతం ఖాళీ అయిన నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి కోసం కూడా ఆయన తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిత్వం పొందేందుకు మొదటి స్థానంలో పోటీలో

(మిగతా 8వ పేజీలో)

● జిల్లా రాజకీయాల్లో కీలకం

గత నాలుగు ఎన్నికల్లో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ గెల్చుకోలేకపోయింది. ఈ నాలుగు ఎన్నికల్లో ఒకసారి పొన్నం ప్రభాకర్, రెండుసార్లు ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్న చల్మెడ లక్ష్మీనరసింహరావు, నాలుగోసారి పురుమల్ల శ్రీనివాస్ కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేసి ఓడిపోయారు. వరుసగా ఈ నాలుగు ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి ఒకసారి, బీఆర్ఎస్ నుంచి మూడుసార్లు ప్రస్తుత శాసనసభ్యుడు గంగుల కమలాకర్ గెలుస్తూ వచ్చారు. జిల్లా కేంద్రంలో రాజకీయాలకు కీలకమైన కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో స్థానం కోల్పోయిన కాంగ్రెస్ వరుసగా రెండు ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థిని గెలిపించుకోలేకపోయింది. ఈ రెండు ఎన్నికల్లో బీజేపీకి చెందిన ప్రస్తుత కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ ఎంపీగా గెలుపొందారు. ప్రస్తుతం ఎంపీగా బీజేపీకి చెందిన సంజయ్ కుమార్, ఎమ్మెల్యేగా బీఆర్ఎస్‌కు చెందిన గంగుల కమలాకర్ ప్రాతినిధ్యం వహిస్తుండగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పదవికాలం ముగిసే వరకు బీఆర్ఎస్‌కు చెందిన సునీల్‌రావుమేయర్‌గా ఉన్నారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మెజార్టీ ఓట్లు కరీంనగర్‌లోనే ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా, మేయర్‌గా గెలవాలంటే ఆ పార్టీకి గట్టిపట్టు ఉండాల్సి ఉంటుంది. కాంగ్రెస్ వచ్చే ఎన్నికల్లో ఈ రెండు స్థానాలు గెల్చుకోవాలంటే తీవ్రంగా చెమటోడ్చాల్సి ఉంటుంది. సమన్వయంతో అందరిని కలిసికట్టుగా నడిపించగలిగి కొత్తవారిని ఆకర్షించి ఆహ్వానించేవారు ఇక్కడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా, డీసీసీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపడితేనే అది సాధ్యమవుతుందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. అధిష్ఠానం ఆ దిశగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

సుభాష్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ పమేలాసత్పతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికంగా పరిష్కారం కాని సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తుంటారని, అధికారులు వారి సమస్యలను తెలుసుకొని సత్వరమే పరిష్కరించాలన్నారు. మొత్తం 264 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ డీడీ పవన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో సుధాకర్ పాల్గొన్నారు.

భూ భారతి ద్వారా సమస్యల పరిష్కారం

● అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్



దుద్దెనపల్లి గ్రామంలోని రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్

సైదాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం ద్వారా రైతుల భూ సమస్యలు పరిష్కారమవుతాయని అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్ అన్నారు. భూ భారతి చట్టం పైలట్ ప్రాజెక్టులో భాగంగా సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి, బొమ్మకల్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్ దుద్దెనపల్లి, బొమ్మకల్ గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని, భూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. వివిధ భూ సమస్యలపై దుద్దెనపల్లిలో 61, బొమ్మకల్‌లో 32 దరఖాస్తులు వచ్చాయని, రెండు గ్రామాల్లో కలిపి 93 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్ తెలిపారు.

శిశువుల సంరక్షణకు 'ఊయల'

● ఎంసీహెచ్‌లో క్రెడిల్ బేబీ రిసెప్షన్ సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్



ఊయలను ప్రారంభించి డాక్టర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

సుభాష్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): అప్పుడే పుట్టిన శిశువును వద్దనుకునే వారు నిర్లక్ష్యంగా రోడ్లపై, చెత్తకుప్పల్లో వదిలి వేయకూడదని, జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్న ఊయల(క్రెడిల్ బేబి రిసెప్షన్ సెంటర్)లో వదిలి వెళ్లాలని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. సోమవారం జిల్లా ఆసుపత్రిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో మహిళా, శిశు సంక్షేమశాఖ బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిశువుల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపుడే పుట్టిన బిడ్డను వద్దనుకునేవారు ఊయలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిశువులకు అనారోగ్య సమస్యలు ఉన్నట్లైతే వారికి ప్రభుత్వమే వైద్యం అందించి పెంచుతుందని తెలిపారు. ఈ ఊయల వద్ద ఎలాంటి సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండదని, ఊయలలో వేసిన వారిపై నిఘా, విచారణ వంటివి ఉండవని తెలిపారు. వివరాలు వెల్లడించినప్పటికి అవి గోప్యంగా ఉంచుతారని తెలిపారు. నేరుగా శిశువును అప్పగించాలనుకునేవారు 9490881098 నంబరుకు సమాచారం ఇవ్వవచ్చని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. శిశువులను రోడ్లపై, చెత్తకుప్పలపైన వదిలివేయడం వల్ల వారు చనిపోయే అవకాశం ఉందని, ఎంతోమంది పిల్లలు లేని దంపతులు దత్తత కోసం ఆశ్రయిస్తున్నారని తెలిపారు. వదిలివేసిన శిశువులను చట్టప్రకారం దత్తత ఇస్తారని చెప్పారు. ఆపదలో చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098ను సంప్రదించాలని సూచించారు. త్వరలో జిల్లాలోని జమ్మికుంట, హుజూరాబాద్, చొప్పదండి ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు బస్టాండ్, రైల్వే స్టేషన్లలో ఊయలను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ నవీన, చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కో ఆర్డినేటర్ సంపత్ పాల్గొన్నారు.

చల్లగ చూడు సరస్వతీ మాత

- 15 నుంచి 26 వరకు సరస్వతీ పుష్కరాలు
- కాళేశ్వరంలో ప్రత్యేక ఏర్పాట్లు..

7

కల్యాణం... కమనీయం...



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 12 : నగరంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, లక్ష్మీనారాయణస్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం కన్నుల పండువలా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో సహస్రదీపాలంకరణ సేవ నిర్వహించారు. రాత్రి గరుడ వాహన సేవలో భాగంగా శ్రీవారు ప్రకాశంగంజ్, టవర్‌సర్కిల్, రాజీవ్‌చౌక్ ద్వారా విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ, నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో కందుల సుధాకర్ పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్మీ సంఘీభావ ర్యాలీ

సుభాష్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌పై యుద్ధం చేస్తున్న భారత్ జవాన్లకు మద్దతుగా తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీని నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి అమరవీరుల స్థూపం వరకు నిర్వహించిన ఈ ర్యాలీని కలెక్టర్ పమేలాసత్పతి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులు అమాయక భారత ప్రజలను చంపివేయడం అమానుష చర్య అని అన్నారు. ఆపరేషన్ సింధూరంతో ఉగ్రవాదుల స్థావరాలను, ఉగ్రవాదులను మట్టికరిపించారని అన్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ మడిపల్లి కాళీచరణ్, అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్, సుప్రియ, సరస్వతి, రామకృష్ణ, పవన్‌కుమార్, శ్రీనివాస్, జనార్దన్‌రావు, ఏసీపీ వెంకటస్వామి, సీఐలు సృజన్‌రెడ్డి, కోటేశ్వరరావు, కా ర్యదర్శి సంగెం లక్ష్మణరావు, అసోసియేట్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

పైరవీలకే పెద్దపీట

● హెడ్‌కానిస్టేబుళ్ల పోస్టింగ్‌లో సీనియారిటీకి మంగళం

కరీంనగర్ క్రైం, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసుశాఖలో పైరవీలకే పెద్దపీట వేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కానిస్టేబుల్ నుంచి పదోన్నతిపై హెడ్‌కానిస్టేబుళ్లగా ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్ళిన కొందరు పైరవీలతో జిల్లాలో పోస్టింగ్‌లు పొందుతున్నారు. ఇటీవల 1992, 193, 1995 బ్యాచ్‌ల వరకు కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుల్ పదోన్నతులు లభించాయి. జోన్-3 పరిధిలో 317 జీవో ప్రకారం జోన్‌లోని ఇతర జిల్లాలకు వారంతా బదిలీ అయ్యారు. కరీంనగర్ జిల్లాలో ఖా ళీలు లేకపోవడంతో జిల్లాకు చెందిన దాదాపు 150 మంది వరకు హెడ్‌కాని స్టేబుళ్ల ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లారు. కొందరు హెడ్‌కానిస్టేబుళ్ల పదవి విరమణ పొందుతుండడంతో నెలలో ఒకటి రెండు పోస్టులు ఖాళీ కాగానే వెంటనే ఇతర జిల్లాలో పనిచేస్తున్న వారు పైరవీలు చేసు కుంటూ జిల్లాకు బదిలీపై వస్తు న్నారు. ఇతర జిల్లాలో పనిచేస్తున్న హెడ్‌కాని స్టేబు ళ్లను సీనియారిటీ ప్రకారం జిల్లాకు బదిలీ చేయా లని పలువురు హెడ్‌కాని స్టేబుళ్ళు కోరుతు న్నారు. కాని ఇది అమలు కావటంలేదు.

● సమస్యలతో సతమతమవుతున్న సీనియర్లు

1992 బ్యాచ్‌కు చెందిన వారు కొందరు కామారెడ్డి, మెదక్, సిద్దిపేట వంటి దూరపు జిల్లాలో పనిచేస్తుండగా కొందరు జూనియర్ హెడ్‌కానిస్టేబుళ్ల మాత్రం పైరవీలతో జిల్లాకు బదిలీ చేయించుకుంటుండడంతో తమకు అన్యాయం జరుగుతున్నదని సీని యర్లు వాపోతున్నారు. తాము రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్నామని, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న విషయాన్ని కూడా చూడకుండా జూనియర్‌లకు జిల్లాలో పోస్టింగ్‌లకు ప్రాధాన్యమిస్తున్నారని ఆవేదనను వ్యక్తం చేస్తు న్నారు. చాలా కాలంగా కరీంనగర్‌లో పని చేస్తూ పలుకుబడి, ఆర్థిక వెన్నుదన్నుతో జిల్లాలో పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో 21 పోలీసు స్టేషన్లు, స్పెషల్ బ్రాంచి, ఇంటిలిజెన్స్, సీసీ ఆర్‌బీ వంటి పోలీసుశాఖలో అనుబంధ విభాగాల్లో కలిపి దాదాపు 150 హెడ్‌కానిస్టేబుల్ పోస్టులుంటాయి. ఒక్కో స్టేషన్‌లో నాలుగు హెడ్‌కానిస్టేబుల్ పోస్టులు ఉంటాయి. ఈ పోస్టుల్లో సీనియారిటీ ప్రకారం బదిలీలు జరపాలని ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుళ్ల ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించిన డీఎంహెచ్‌వో

సుభాష్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆసుపత్రి ఆవరణలోని వెల్‌నెస్ సెంటర్‌ను డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వెల్‌నెస్ సెంటర్‌లో అందుతున్న వైద్యసేవల గురించి అక్కడ ఉన్న ఉద్యోగులు, పెన్షనర్లను అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లో వారికి అందుతున్న సేవలు వివరాలను తెలుసుకున్నారు.

వానాకాలం సాగుకు శ్రీకారం

కరీంనగర్ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో వానాకాలానికి సంబందించిన పంట ప్రణాళికను వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేశారు. కొంత మంది రైతులు ఇప్పటికే పొలాలను ట్రాక్టర్‌తో దున్ని చదును చేసుకుంటున్నారు. కరీంనగర్ మండలంలో సాధారణ పంటల సాగు విస్తీర్ణం మొత్తం 16,182 ఎకరాలు ఉండగా ఈసారి 15,878 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అత్యధికంగా వరి పంట 12,500 ఎకరాలకు పైగా సాగు చేసే అవకాశం ఉంది.



నారు మడి దున్నుతున్న రైతు

● అవసరమున్న విత్తనాలు

వానాకాలం సీజన్‌లో సాగు విస్తీర్ణాన్ని బట్టి విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వరి 12,623 ఎకరాలు సాగు చేస్తారని అంచనా వేయగా 3,666 క్వింటాళ్ల విత్తనాలు అవసరం. మొక్కజొన్న 854 ఎకరాలకు 68 క్వింటాళ్లు, పత్తి 2,300 ఎకరాలకు 4,600 ప్యాకెట్లు, పెసర 48 ఎకరాలకు నాలుగు క్వింటాళ్లు, కందులు 72 ఎకరాలకు ఆరు క్వింటాళ్లు, ఇతర పంటలు 81 ఎకరాలకు ఆరు క్వింటాళ్ల విత్తనాలు అవసరమని అంచనా వేశారు. యూరియా 1,089 మెట్రిక్ టన్నులు, డీఏపీ 800, ఎంఓపీ 399, కాంప్లెక్స్ ఎరువులు 1,138 మెట్రిక్ టన్నులు అవసరమని అంచనాలు రూపొందించారు.

రైతులకు అందుబాటులో ఎరువులు, విత్తనాలు



మండల వ్యవసాయ శాఖ అధికారి బి సత్యం

వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టాం, గతంలో కంటే ఈ సీజన్‌లో పంట విస్తీర్ణం పెరగనుంది.

పోలాండ్‌లో రోడ్డు ప్రమాదం

● మల్యాల యువకుడి దుర్మరణం



మనోజ్‌గౌడ్(ఫైల్)

మల్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): పోలాండ్ దేశంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్యాల మండల కేంద్రానికి చెందిన పొన్నం మనోజ్‌గౌడ్(29) అనేయువకుడు మృతిచెందాడు. మనోజ్‌గౌడ్ నడుచుకుంటూ వెళ్తుండగా వెనుకాల నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. మనోజ్‌గౌడ్ రెండేళ్ల క్రితం ఉపాధి కోసం పోలాండ్ వెళ్లాడు. సోమవారం ఉదయం రహదారి పక్క నుంచి నడుచుకుంటూ పనికి వెళ్తుండగా వెనుకాల నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలతో మనోజ్ అక్కడిక్కడే మృతిచెందాడు. మనోజ్ మృతితో కుటుంబసభ్యుల్లో విషాదం నెలకొంది.

వ్యాపార భాగస్వాముల వేధింపులతో ఒకరి బలవన్మరణం

కరీంనగర్ క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇసుక క్వారీ, హైదరాబాద్‌లో భూముల కొనుగోలులో పెట్టుబడి పెట్టిన వ్యక్తికి తోటి భాగస్వాములు డబ్బులు చెల్లించకుండా వేధింపులకు గురి చేయడంతో ఆదివారం రాత్రి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సీఐ, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా వెల్గటూర్‌మండలం కిషన్‌రావుపేటకు చెందిన మోకినపల్లి శ్రీనివాస్(38) తీగలగుట్టపల్లిలో నివాసం ఉంటూ ఆటో కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. యాదగిరి, భూపతి పాపయ్య, రెడ్డి రాజు, నగునూరు గోపితో కలిసి మృతుడు శ్రీనివాస్ ఇసుకక్వారీలో, హైదరాబాద్‌లోని భూముల్లో పెట్టుబడి పెట్టాడు. శ్రీనివాస్ తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వాలని చాలా కాలంగా భాగస్వాములను అడుగుతున్నప్పటికీ వారు డబ్బులు ఇవ్వకుండా ఆర్థికంగానూ, మానసికంగానూ వేధింపులకు గురి చేశారు. దీంతో ఆవేదనకు గురైన శ్రీనివాస్ ఆదివారం రాత్రి తీగలగుట్టపల్లిలోని అద్దె ఇంటిలో ఉరేసుకున్నాడు. శ్రీనివాస్ భార్య అంజలి ఫిర్యాదుతో నిందితులు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు, దర్యాప్తుచేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై దాడులు

● పలువురు యజమానులకు జరిమానా

మెట్‌పల్లిటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని పలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై కమిషనర్ టి.మోహన్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది దాడులు నిర్వహించారు. పరిశుభ్రత పాటించని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు, సింగిల్‌యూజ్‌ప్లాస్టిక్‌ను వాడుతున్న వారికి1500 రూపాయల జరిమానావిధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ మాట్లాడుతూ జ్యూటుబ్యాగులు మాత్రమేవాడాలని సూచించారు. దుకాణ దారులందరూ ట్రేడ్‌లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని లేకపోతే సీజ్ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ విష్ణు, మున్సిపల్ సిబ్బంది ముజీబ్, పున్నం నాయక్, ప్రశాంత్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకం పట్టాలెక్కేనా?

● అభివృద్ధికి దూరంగా నాంపల్లి గుట్ట
● రూ. 30 కోట్ల పనులు ప్రతిపాదనలకే పరిమితం



వేములవాడ కల్చరల్, మే 12: వేములవాడ మండలంలోని నాంపల్లి గుట్ట ప్రకృతి అందాలకు నిలయం. చుట్టూ పచ్చదనంతో ఎంతగానో ఆకర్షిస్తూ.. గుట్ట మధ్య ఐదు తలల సర్పాకారంలో గుట్టపై నిర్మించిన కాళీయమర్ధనం, తలపై శ్రీకృష్ణుడి నృత్యరూపం, చుట్టూ పచ్చని పంటపొలాలు, ఓ వైపు మూలవాగు అందాలు, మరో వైపు మానేరువాగు అందాలు, ఎదురుగా మధ్యమానేరు డ్యామ్ బ్యాక్ వాటర్ చూపరులను కట్టిపడేస్తాయి. ఆరువందల సంవత్సరాల క్రితమే నాంపల్లి గుట్టపైన మూడు నామాల రూపంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి ప్రతిమ కుడివైపున హనుమంతుడి ప్రతిమ వెలిసినట్లు, చోళుల కాలంలోనే స్వామి వారికి పూజలు జరిగినట్లు ఆధారాలు చెబుతున్నాయి. మహిమాన్వితంగా వెలుగొందుతున్న లక్ష్మీనృసింహస్వామి ఆలయం ఉన్న నాంపల్లి గుట్ట పర్యాటకంగా అభివృద్ధి దూరంగా ఉన్నది. 2015వ సంవత్సరంలో అప్పటి సీఎం కేసీఆర్ వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయానికి వచ్చిన సందర్భంగా నాంపల్లి గుట్టను సందర్శించారు. గుట్టను పరిశీలించి అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అప్పట్లోనే రూ. 28 నుంచి రూ. 30 కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధ చేసి చిత్రాలను సైతం విడుదల చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నాంపల్లి గుట్ట పర్యాటకాభివృద్ధికి నోచుకోలేదు.

● కట్టిపడేసే కాళీయమర్ధనం

నాంపల్లి గుట్టపైకి వెళ్లే మార్గంలో మధ్య భాగాన 2003 సంవత్సరంలో చెన్నమనేని విద్యాసాగర్‌రావు అప్పటి కేంద్రసహాయ మంత్రిగా ఉన్నప్పుడు ఐదు తలల సర్పాకారంలో వున్న కాళీయమర్ధనాన్ని నిర్మించారు. సుమారు సంవత్సరం పాటు కాళీయ మర్ధనం నిర్మాణ పనులు చేపట్టారు. పాముపైన శ్రీకృష్ణుడు నృత్యం చేస్తున్నట్లు వెనుకభాగంలో పచ్చటి పంటపొలాలతో ఎంతో ఆకర్షనీయంగా చూపరులను కట్టిపడేస్తుంది. కాళీయమర్ధనం లోపలికి వెళ్లే మార్గంలో శ్రీకృష్ణుడి లీలకు సంబంధించిన విగ్రహాలను ఏర్పాటు చేశారు. కాళీయమర్ధనం లోపల ఉగ్రనృసింహస్వామి విగ్రహంతో పాటు నాగదేవత విగ్రహాలు ఉన్నాయి. భక్తులు శ్రీస్వామి వారిని దర్శించుకుని నాగ దేవతకు పాలతో అభిషేకం నిర్వహిస్తారు.

● నిరాదరణకు గురువుతన్న గుహలు, శిలలు

నాంపల్లి గుట్టపైన రెండు ధర్మగుండాలు ఉన్నాయి. గుట్ట బండరాళ్లలో వున్న ధర్మగుండం సుమారు వెయ్యి యేళ్ల క్రితం శ్రీరాజరాజేంద్రుడు కట్టించినట్లు స్థానికులు చెబుతున్నారు. ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి తడిబట్టతో శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారిని దర్శించుకునేవారు. నాంపల్లి గుట్టపైన గోపురం పక్కన సహజసిద్ధంగా ఏర్పడిన బండరాళ్ల మధ్య ఒక శివలింగంతో పాటు పలు విగ్రహాలు ఉన్నాయి. ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరాదరణకు గురవుతున్నాయి. క్రీ.శ 10వ శతాబ్దంలో నవనాథ సిద్దులు (తొమ్మిది మంది) ఈ గుట్టపై తపస్సు చేసి సిద్ధి పొందారని, ప్రతినిత్యం నవనాథ సిద్ధ మహర్షులు ఈ గుహలో నుంచి భూగర్భ మార్గంలో వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని చేరుకుని పూజలు చేసేవారని నానుడి. అలాంటి గుహలు నిరాదరణకు గురవుతున్నాయి. అంతే కాకుండా నాంపల్లి గుట్ట చుట్టూ ఎన్నో విశిష్టతలు ఉన్నాయి అందులో 12వ శతాబ్దం సంబంధించిన జైన మతానికి చెందిన పార్శ్వనాథుని ప్రతిమ బండరాయికి కనిపిస్తుంది. ఇలాంటి ప్రతిమలు రెండు తెలుగు రాష్ట్రాల్లో అరుదుగా ఉన్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. అంతే కాకుండా గుట్టకు నాలుగు వైపులా పెద్ద పెద్ద బండరాళ్లకు హనుమంతుని ప్రతిమలు కనిపిస్తాయి.



నాంపల్లి గుట్టపై రోప్ వే ఊహా చిత్రం

● ప్రచారానికే పరిమితమైన అభివృద్ధి

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయ అభివృద్ధిలో భాగంగా నాంపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి గుట్ట అభివృద్ధి జరుగుతుందని జోరుగా ప్రచారం జరిగింది నాంపల్లి గుట్ట సుమారుగా 52 అడుగుల ఎత్తుతో కొంతభాగం నిటారుగా ఉండ టంతో గుట్టపైన కొలువుదీరిన స్వామి వారిని వృద్ధులు, వికలాంగులు దర్శించుకునేందుకు ఇబ్బందిగా మారింది. దీంతో నాంపల్లి గుట్టపైకి వెళ్లేందకు వీలుగా రోప్‌వే నిర్మాణం చేపట్టాలని, నాంపల్లి గుట్టపైకి వెళ్లేందుకు ఒక్కటే ఘాట్ రోడ్డు ఉండటంతో ప్రొటెక్షన్ వాల్‌తో మరో ఘాట్ రోడ్డు నిర్మాణం, గుట్టపైన ఉన్న రెండు ధర్మగుండాలను ఆహ్లాదకరంగా సుందరీకరణకు, గుట్టపైకి వచ్చే భక్తులను ఆకట్టుకునేలా వసతిగృహాల నిర్మాణం, గుట్టపైన ఆహ్లాదకరమైన వాతావరణంలో ధ్యానమందిరం నిర్మాణం, ప్లానిటోరియం, గుట్ట చుట్టూ వున్న ప్రకృతి అందాలను భక్తులు వీక్షించేందుకు గుట్టపైన పనోరమా వ్యూ పాయింట్‌ను ఏర్పాటు చేసేందుకు ఊహాచిత్రాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు అధికారులు. రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో మందడుగు పడటంతో భక్తులు నాంపల్లి గుట్ట కూడా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక దృష్టిసారించాలని కోరుతున్నారు.

గోనె సంచులు ఇవ్వడంలో నిర్లక్ష్యం

● పురుగుల మందు డబ్బాతో రైతు నిరసన

పెద్దపల్లి రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని కాపులపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో గన్ని సంచులు ఇవ్వకపోవడంపై చొప్పరి కనుకయ్య అనే రైతు ఆదివారం సాయంత్రం పురుగుల మందుతో ఆత్మహత్యయత్నానికి పాల్పడేందుకు యత్నించాడు. కనుకయ్య 25రోజుల క్రితం కేంద్రంలో ధాన్యాన్ని ఆరబోశాడు. పలుమార్లు అడిగినా గన్ని సంచులు ఇవ్వలేదు. పది రోజుల క్రితం కేంద్రంలో పోసిన ధాన్యానికి గన్ని సంచులు ఇవ్వడంతో కనుకయ్య నిర్వాహకులను నిలదీశారు. కొనుగోలు కేంద్రంలో క్రమపద్ధతి పాటించడం లేదని, అందరిని సమానంగా చూస్తూ కొనుగోలు చేయాలని సూచించినా నిర్వాహకులు పట్టించుకోలేదు. దీంతో ఓ వైపు వర్షాలు, మరోపక్క ఎండతీవ్రత, కేంద్రం నిర్వాహకుల వైఖరిని నిరసిస్తూ కనుకయ్య ఆవేదనకు గురై పురుగుల మందు తాగేందుకు సిద్ధపడగా అక్కడే ఉన్న రైతులు అడ్డుకున్నారు. ఇంత జరిగినా నిర్వాహకులు గన్ని సంచులు ఇవ్వలేదని రైతు చొప్పరి కనుకయ్య పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆన్‌లైన్ సేవలు

● పది నిమిషాల్లో డాక్యుమెంట్ అందజేత
● ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ ప్రవీణ్



డాక్యుమెంటు అందజేస్తున్న రిజిస్ట్రార్

పెద్దపల్లి టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): స్లాట్‌బుక్ చేసుకున్న తరువాత కేటాయించిన తేదీలో కార్యాలయానికి వస్తే కేవలం పది నిమిషాల్లో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌తోపాటు మ్యూటేషన్ అందించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లారిజిస్ట్రార్ బీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పెద్దపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆన్‌లైన్‌సేవలు పైలట్‌ప్రాజెక్టు కింద ఎంపికైంది. సోమవారం ఆన్‌లైన్‌సేవలు ప్రారంభించిన అనంతరం ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మొదటి విడుతలో పైలెట్ ప్రాజెక్టు కింద 22 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఎంపికయ్యాయని అందులో జగిత్యాల, రామగుండం ఉన్నాయని, రెండోవిడుతలో పెద్దపల్లి ఉందన్నారు. జూన్2న ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు. గతంలో స్లాట్‌బుక్ చేసుకున్న తరువాత రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌కు సుమారు వారంరోజులు సమయం పట్టేదన్నారు. ప్రస్తుతం పదినిమిషాల్లో ఇస్తామన్నారు. ఈ విధానం ద్వారా రోజుకు 48రిజిస్ట్రేషన్లు చేయ వచ్చన్నారు. దీంతో కార్యాలయం చుట్టు తిరగాల్సిన అవసరం లేదని, అలాగే ఎక్కువ సమయం నిరీక్షించవల్సిన పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. ప్రాజెక్టు ప్రారంభించగానే ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన గడ్డం ఈశ్వరమ్మకు డాక్యుమెంట్‌ను అందజేశారు. అశోక్, పారుపెల్లి వేణు తదితరులున్నారు.

రేణుక ఎల్లమ్మకు జలాభిషేకం

వీణవంక, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్భాపూర్ గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో గౌడకులస్థులు రేణుక ఎల్లమ్మకు జలాభిషేకం చేశారు. నీటిబిందెలను నెత్తినపెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడసంఘం మహిళలు ప్రతిఇంటి నుంచి కుటుంబసభ్యులతో కలిసి ఊరేగింపుగా కదిలారు. గీతకార్మికులందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.



వల్భాపూర్‌లో బిందెలతో ఎల్లమ్మ ఆలయానికి వెళ్తున్న మహిళలు

చొప్పదండిలో హార్వెస్టర్ దగ్ధం

చొప్పదండి, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌స్టేషన్ వద్ద సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. హార్వెస్టర్‌కు మంటలు అంటుకోగా సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు ఫైర్ ఇంజన్‌తో మంటలను ఆర్పివేశారు. దాదాపు రూ.5లక్షల వరకు నష్టం జరిగినట్లు తెలుస్తోంది.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి



తిరుపతి రావు(ఫైల్)

తిమ్మాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): చేతికి వచ్చిన కుమారుడు ఆత్మహత్య చేసుకుని మృతిచెందగా తట్టుకోలేని తండ్రి ఆదివారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులుతెలిపిన వివరాల ప్రకారం.. మన్నెంపల్లి గ్రామానికి చెందిన సిరికొండ తిరుపతి రావు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతని కుమారుడు సిరికొండ నిఖిల్‌రావు(22) హైదరాబాద్‌లో ఉంటూ బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతూ ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడ్డాడు. అందులో డబ్బులు పోగొట్టుకొని మనస్తాపానికి గురై గత మార్చి10న గ్రామశివారులోని వారి వ్యవసాయబావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుపతిరావు కుమారుడు లేని లోటు జీర్ణించుకోలేకపోయాడు. ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ బావివద్ద (కుమారుడు పడిన బావి) పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం తిరుపతిరావు తన భార్య శ్యామలకు ఫోన్‌చేసి తెలిపాడు. వెంటనే ఆమె స్థానికులకు తెలుపగా వారు తిరుపతిరావును కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే తిరుపతిరావు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైనచికిత్స కోసం హైదారాబాద్ తరలించారు. హైదారాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం తిరుపతిరావు మృతిచెందాడు. రెండునెలల్లో కుమారుడు, తండ్రి మృతిచెంద డంతో తిరుపతిరావు భార్య శ్యామల ఒంటరైంది. ఈ సంఘటనతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్

అంతర్గాం, మే 12 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని బుగ్గ రోడ్డు వద్ద గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కమాన్‌పూర్, భూపాలపల్లి ఏరియాకు చెందిన సాయి ప్రదీప్, యశ్వంత్, శివ, కమల్‌లు ఒడిశా రాష్ట్రం నుంచి రెండు బైక్‌లపై 15కిలోలు సుమారు రూ.8లక్షల విలువ గల గంజాయిని తరలిస్తున్నారు. విశ్వసనీయవర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు ఎస్ఐ వెంకటస్వామి బుగ్గగుట్ట వద్ద వల పన్ని పట్టుకున్నారు. నిందితుల వద్ద ఉన్న బ్యాగుల తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. సోమవారం విలేకరుల సమావేశంలో సీఐ వివరాలను వెల్లడించారు. గంజాయితో పట్టుబడిన నిందితులను గోదావరిఖని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్ఐతోపాటు పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు. హెడ్ కానిస్టేబుల్ అక్కపాక రవీందర్, మల్లేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

జగిత్యాల అగ్రికల్చర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డ ఆంధ్రప్రదేశ్‌లోని కొండారెడ్డిపల్లెకు చెందిన మాచనూరు కొండయ్య(22) జైలుశిక్ష పడినట్లు ట్రాఫిక్‌ఎస్సై మల్లేష్ తెలిపారు. జిల్లాకేంద్రంలో డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలునిర్వహిస్తున్న సమయంలో పట్టుబడగా, కేసునమోదుచేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. న్యాయమూర్తి కరుణాకర్ కొండయ్యకు రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

చంపుతామని బెదిరించిన ఐదుగురికి రెండేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి చంపుతామని బెదిరించిన కేసులో సిరిసిల్ల పట్టణం చంద్రంపేటకు చెందిన ఎర్ర మల్లేశం, ఎర్ర రాజవ్వ, ఎర్ర సుజాత, ఎడవల్లి మల్లవ్వ, జింక దేవవ్వలకు ఒక్కొక్కరికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 6వేల జరిమానా విధిస్తూ సోమవారం సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయ మూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించారని టౌన్ సిఐ కె. కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటకు చెందిన అరుణ తన ఇంటి వద్ద లేనిది చూసి ఇంటి వెనుక ప్రహరీ గోడను ఎర్ర మల్లేశం, రాజవ్వ, సుజాత, మల్లవ్వ, దేవవ్వలు కలిసి కూలగొట్టారు. ఈ విషయాన్ని పక్కనే ఉన్న పోచవ్వ వెళ్లి అరుణకు చెప్పింది. దీంతో కోపోద్రిక్తులైన ఐదుగురు వ్యక్తులు కలిసి తిట్టుకుంటూ గడ్డపారతో పొడిచి గాయపరిచేందుకు ప్రయత్నించారు. ఈ దాడిని చూసిన నర్మెట్ట రమేశ్, రగుడు లక్ష్మన్ వెళ్లి పోచవ్వ, అరుణలను కాపాడారు. అయినప్పటికీ మిమ్మల్ని ఎప్పటికైనా చంపుతామని ఐదుగురు వ్యక్తులు బెదిరించారని సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు అరుణ ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ అనంతరం చార్జిషీట్ ఫైల్ చేశారు. ఈ కేసులో కోర్టు మానిటరింగ్ అధికారి శ్రావణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ 11మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున పిపి సందీప్ వాదించగా కేసు పూర్వపరాలను పరిశీలించిన సిరిసిల్ల ప్రథమ శ్రేణిన్యాయమూర్తి ప్రవీణ్ నేరస్థులకు రెండేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 6వేల జరిమానా విధించారని సీఐ తెలిపారు.

నాటుసారా బట్టీలపై పోలీసుల దాడి



కొలనూర్‌లో నాటుసారా తయారీ సామాగ్రిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఓదెల, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్‌లో ఆదివారం రాత్రి నాటుసారా తయారీకేంద్రాలపై పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, పది లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. నాటుసారా తయారీ, అమ్మకాలు కొనసాగిస్తే సమాచారం ఇవ్వాలని, వారిపేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నాటుసారా తయారు చేసి విక్రయానికి పాల్పడుతున్న గండికోట కనుకయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఏఎస్ఐ రత్నాకర్, పోలీస్ సిబ్బంది రాజు, రాజేందర్, అశోక్ పాల్గొన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గంగాధర, మే 12 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం వెంకటయ్యపల్లిలో మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై స్వాతి తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. వెంకటయ్యపల్లి గ్రామ వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మూడుట్రాక్టర్లతో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

ఇల్లంతకుంటలో..

ఇల్లంతకుంట, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాపూర్ గ్రామసమీపంలోని బిక్కవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం దాడిచేయగా డ్రైవర్‌బెజ్జంకి తిరుపతి పరారయ్యాడు. ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

వైద్య, ఆరోగ్య రంగంలో ప్రైవేటీకరణను నిలిపివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

భగత్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య రంగంలో ప్రైవేటీకరణను నిలిపివేయాలని ఆశవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. సోమవారం నగరంలోని ముకుంద లాల్ మిశ్రాభవన్‌లో ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు లేబర్‌కోడ్స్ తీసుకురావడం సమ్మెహక్కు, ఉద్యోగ, సామాజిక భద్రత కాలరాయడమేనన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీ కరణ విధానాలు అమలు చేస్తోందన్నారు. మే20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కేంద్రప్రభుత్వంపై తిరుగుబాటు మొదలు పెట్టాలన్నారు. లేబర్‌కోడ్స్ రద్దుకోసం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రజలకు వివరించాలని, రైతులను, కూలీలను కలుపుకొని పెద్దఎత్తున సమ్మె చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి మారెళ్ల శ్రీలత, నాయకులు పద్మ, లక్ష్మి, రజిత, పరిమిత, సత్యలక్ష్మి, ప్రియాంక, సరిత, లత పాల్గొన్నారు.

కోడెల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి



రాజన్న ఆలయ గోశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

వేములవాడ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : తీవ్ర ఎండల నేపథ్యంలో రాజన్న ఆలయ కోడెల సంరక్షణపై ప్రత్యేకదృష్టి సారించాలని జిల్లాకలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. తిప్పాపూర్‌లోని రాజరాజేశ్వరస్వామి ఆలయ గోశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోవులకు అందిస్తున్న మేత, ఇతర ఆహార పదార్థాల నాణ్యత, సౌకర్యాలను ఆలయ ఈవో వినోద్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. వాటి సంఖ్యపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ కోడెలకు వేసిన జియో ట్యాగులను పరిశీలించారు. ప్రతి గోవుకు జియో ట్యాగింగ్‌తో కూడిన పరికరాన్ని పెట్టాల న్నారు. తద్వారా కోడెల పంపిణీ అనంతరం వాటియొక్క లొకేషన్ ట్రాకింగ్ చేయవచ్చన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున గోశాల షెడ్లలో నీటి తుంపర్ల యంత్రాలను ఏర్పాటు చేయాలన్నారు. షెడ్లలో నిలువ చేసిన గడ్డిని తరలించి కోడెలకు మేతకు ఉపయోగించాలన్నారు. కోడెలకు సరిపడా పచ్చిగడ్డి అందుబాటులో ఉంచాలన్నారు.

ఎండాకాలం నేపథ్యంలో గోవుల సంరక్ష ణను మరింత బాధ్యతగా చూసుకోవాలని గోశాల సిబ్బందికి సూచించారు. కోడెలకు నిత్యం అందించే దాణా, మేత, తాగునీరు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. కోడెల వైద్యం టీకాలు, ఇతర అంశాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. కోడెల వయసు ఆధారంగా వాటిని వివిధ షెడ్‌లలో పెట్టాలన్నారు. అనంతరం పశువైద్యాధి కారులు గోవులకు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్లు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి రవీందర్‌రెడ్డి, ఆలయ ఏఈవో శ్రీనివాస్, గోశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

24 నుంచి 'తానాకాన్' రాష్ట్ర సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న తానాకాన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ శ్రీనివాస్

సుభాష్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్‌హోమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల24,25 తేదీల్లో తానాకాన్ పేరిట రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ శ్రీధర్, ఆర్గనైజింగ్ ఫైనాన్స్ సెక్రెటరీ డాక్టర్ బండారి అరుణ్‌కుమార్ తెలిపారు. సోమవారం నగరంలోని ఐఎంఏ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24, 25వ తేదీల్లో నగరంలోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో నిర్వహించనున్న సదస్సులో 24న సీఎంఈ(కంటిన్యూ మెడికల్ ఎడ్యుకేషన్) కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 25న చిన్న, మధ్యతరహా హస్పిటల్స్, నర్సింగ్‌హోమ్స్ ఎదుర్కొంటున్న సమస్యలైన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, హాస్పిటల్స్ పర్మిషన్(న్యూ, రినివల్స్), పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రూల్స్ అండ్ రెగ్యులేషన్స్, ట్రేడ్ లైసెన్స్ ఎస్‌టీపీ, ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్‌లపై దాడులు తదితర సమస్యలపై చర్చించనున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 500 మందికి పైగా వైద్యులు హాజరతారని తెలిపారు. సమావేశంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేష్, కార్యదర్శి డాక్టర్ నవీన్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎస్ రావు, తానా మాజీ అధ్యక్షుడు డాక్టర్ జగన్‌మోహన్‌రావు, డాక్టర్ శేషశైలజ, డాక్టర్ రవికాంత్, డాక్టర్ మహేశ్, డాక్టర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుడి బోధనలు విశ్వమానవాళికి ఆచరణీయం



వడుకాపూర్ గ్రామశివారులో బుద్ధుడికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

జూలపల్లి/ఎలిగేడు, మే 12 (ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడి బోధనలు విశ్వమానవాళికి ఆచరణీయమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. వడుకాపూర్ గ్రామపరిధిలోగల అతిప్రాచీన బౌద్ధస్తూపం వద్ద సోమవారం బుద్ధపూర్ణిమను పురస్కరించుకుని జూలపల్లి, ఎలిగేడు మండలాల దళిత సంఘాల నాయకులు, బౌద్ధిస్టులు గౌతమ బుద్ధుడి జయంతి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే విజయరమణారావు బుద్ధుడివిగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మానవజాతికి సహనాన్ని, ప్రేమతత్వాన్ని, అహింసను, శాంతిని పంచిన బుద్ధుడి బోధనలు అందరికి ఆదర్శంగా నిలిచాయన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే పంచశీల జెండాను ఆవిష్కరించారు. బుద్ధ క్షేత్రానికి రావడానికి రహదారి సరిగా లేదని, తారురోడ్డు నిర్మాణానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ దేవా శ్రీనివాస్ సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేహదానం అవయవదాన పత్రాన్ని అందించారు. ఎస్ఐ సనత్‌కుమార్, విశ్రాంత సబ్‌ఇన్‌స్పెక్టర్ పుల్లయ్య కాంబ్లే, దేవ శ్రీనివాస్, పర్శరాములుగౌడ్, మొగురం రమేష్, పాటకుల భూమయ్య, పలువురు నాయకులు బౌద్ధిస్టులు, పాల్గొన్నారు.

పీజీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఎంఏ (ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ, ఎకనామిక్స్ సోషియాలజీ), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఎస్సీ (వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, గణాంకాలు, మైక్రోబయాలజీ, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, ఇంజనీరింగ్ ఫిజిక్స్, న్యూట్రిషన్ డైటెటిక్స్, కంప్యూటర్ సైన్స్ డేటా సైన్స్, ఎంకామ్ (జనరల్, ఎఫ్ఎ, సీఏపీ, ఇన్సూరెన్స్), ఎంబీఏ. 1,3వసెమిస్టర్ జనవరి/ఫిబ్రవరి 2025పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారిడాక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. www.satavahana.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ రెండో, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్ లాగ్ పరీక్షలు బుధవారం నుంచి యథావిధిగా ప్రారంభమవుతాయని, వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్స్ పొందుపరిచామని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. కళాశాలలు డౌన్ లోడ్ చేసుకొని విద్యార్థులకు జారీ చేయాలని సూచించారు. పరీక్షలు వాయిదా అంటూ సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మవద్దని తెలిపారు.



కాళేశ్వరం గోదావరి వద్ద ఏర్పాటు చేసిన ఆకృతి

చల్లగ చూడు సరస్వతీ మాత

15 నుంచి 26 వరకు సరస్వతీ పుష్కరాలు

- కాళేశ్వరంలో ప్రత్యేక ఏర్పాట్లు...
- రేపు రాత్రి 10-35 గంటలకు పుష్కర ముహూర్తం ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): భారత దేశం ఎన్నో పుణ్య నదులున్నాయి. గురువు ఒక్కో రాశిలో ప్రవేశించినప్పుడు ఆయా నదికి పుష్కరాలు వస్తాయి. పుష్కరం అంటే జలమని పేరు. మామూలు నదీ స్నానం కంటే పుష్కర స్నానం అనేక రెట్ల పుణ్య ఫలాన్ని, సకల శుభాలను, మోక్షాన్ని ఇస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. సరస్వతీ నది ప్రస్తావన ఋగ్వేదంలో ఉంది. ఈ నది ఎవరికీ కనపడదు. హిమాలయాలలోని శివాలిక్ పర్వత పంక్తుల్లోని ప్లక్షప్రస్రవణగిరిపై పుట్టింది. సరస్వతీ నదీ ప్రస్తావన పద్మ, బ్రహ్మవైవర్త పురాణాల్లోనూ ఉంది. ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు సరస్వతీ పుష్కరాలు రానున్న సందర్భంలో 'ఆంధ్రజ్యోతి' కథనం...

ఇదే పుష్కర సమయ ముహూర్తం...

ఈ నెల 14వ తేదీ రాత్రి 10-35 గంటలకు బృహస్పతి మిథున రాశిలో ప్రవేశించడంతో సరస్వతీ నది పుష్కరాలు ప్రారంభం కానున్నట్లు కాళేశ్వర ఆలయం అర్చకులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

● సరస్వతీ నది ఎక్కడెక్కడ ఉంది?

తొలుత భూమిపై ఉత్తరాఖండ్, చమేలీ జిల్లా బదరీనాథ్ సమీపంలో మానా గ్రామంలో మాత్రమే సరస్వతీ నది కనిపిస్తోంది. ఇదే మొదటి నది. ఈ నదిని అక్కడ ప్రత్యక్షంగా చూడవచ్చు. పాండవులు స్వర్గారోహణం చేసే ముందు మానా గ్రామానికి వచ్చినప్పుడు ఈ నదిని దాటాల్సి వచ్చింది. అప్పుడు భీముడు రెండు కొండల మీద మరో కొండ నిలిపి వంతెనలా ఏర్పాటు చేశాడు. అందుకే దాన్ని భీమ్‌పూర్, భీమ్ వారధి అంటారు. ఇక రెండోది పంచ సరోవరాల్లో ఒకటైన పుష్కర్ సరోవరంలో కనిపిస్తుంది. ఇది రాజస్థాన్‌లోని అజ్మీర్ జిల్లాలో ఆరావళి కొండల మధ్యఉంది. అజ్మీర్‌కు 14 కిలోమీటర్ల దూరంలో బ్రహ్మదేవుడి ఆలయం కూడా ఉంది. పద్మపురాణం ప్రకారం వజ్రనాభుడు అనే రాక్షసున్ని బ్రహ్మ తన చేతిలోని తామర పువ్వు విసిరి సంహరిస్తాడు. ఆ పువ్వులోని 3 రేకులు భూమిపై పడి జేష్ఠ, మధ్య, కనిష్ఠ పుష్కర సరస్సులుగా మారి సరస్వతీ నది ద్వారానే ఏర్పడినాయని తెలుస్తోంది. మూడోది గంగా, యమునా నదులతో పాటు సరస్వతి అంతర్వాహినిగా ప్రవహించే ప్రయాగరాజ్ క్షేత్రం. ప్రయాగకు అమృత తీర్థమని, భాస్కర తీర్థమనే పేర్లు వచ్చాయి. నాలుగోది గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిద్ధాపూర్‌లో ఉన్నది. ఐదోది తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా, కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహితలతో పాటు సరస్వతి అంతర్వాహినిగా ప్రవహిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల పుష్కరిణిలో కూడా సరస్వతి అంతర్లీనంగా ఉందని చెబుతారు. ఇది ఆరోది. ఈ ప్రదేశాల్లో పుష్కర రోజుల్లో స్నానం చేయవచ్చు.

● హెలీకాప్టర్‌తో జాయ్‌రైడ్

పుష్కరాల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం హెలీకాప్టర్ ద్వారా పుష్కరాలను వీక్షించేందుకు జాయ్ రైడ్‌ను అందుబాటులోకి తీసుకరానున్నారు. ఒక్కరికి 4,500 టికెట్ చొప్పున తీసుకొని 6 నుంచి 7 నిముషాల పాటు హెలీకాప్టర్‌లో పుష్కరాలను, కాళేశ్వర అడవుల అందాలను వీక్షించవచ్చు. టికెట్ల బుకింగ్ కోసం టోల్‌ఫ్రీ నంబరును త్వరలోనే విడుదల చేయనున్నట్లు తెలిసింది.

● పుష్కరాలకు ప్రత్యేక ఏర్పాట్లు...



కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు



పుష్కర ఘాట్ వద్ద ఏర్పాట్లు

కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాలకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దేవాదాయశాఖ అధికారులతో కలసి ప్రత్యేక ప్రణాళికను రూపొందిచారు. ప్రభుత్వం 35 కోట్లు విడుదల చేసింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పీఠాధిపతులను ఆహ్వానిస్తున్నట్లు, 12 రోజుల పాటు నదీ హారతి ఉంటుందని మంత్రులు తెలిపారు. పుష్కరాలకు ప్రతీ రోజూ లక్ష మంది వస్తారని అంచనా వేస్తున్నామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పుష్కర ఘాట్‌లు, మంచినీటికి, వసతికి, ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రులు చెప్పారు.

● పుష్కర స్నానం ఎలా చేయాలి?

స్నానానికి ముందు సరస్వతీ నదిని అర్చించి, స్నానం చేయాలి. దంపతులు కొంగులు ముడి వేసుకొని మూడు సార్లు మునిగి సరిగంగ స్నానం చేయాలి. నదీ స్నానం ఎక్కడ, ఎప్పుడు చేసినా ముందు పిడికెడు మట్టిని ఒడ్డు నుంచి తీసుకొని కృత్య అనే శక్తిని స్మరించి నదిలో వేయాలి. ఆ పై సంకల్పం చెప్పుకొని స్నానం చేయాలి. 12 రోజులు 12 రకాల దానాలు ఆచరించాలని శాస్త్రాలు చెబుతున్నాయి.

కలెక్టరేట్ ఎదుట దళితబంధు లబ్ధిదారుల ధర్నా

సుభాష్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): దళితబంధు నిధులపై విధించిన ఫ్రీజింగ్‌ను ఎత్తివేసి గ్రౌండింగ్ చేయాలని కోరుతూ దళితబంధు లబ్ధిదారులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హుజూరా బాద్ నియోజకవర్గానికి చెందిన 60మందికిపైగా రెండోవిడత లబ్ధిదారులకు సంబంధించిన ఫ్రీజింగ్ ఎత్తివేయాలన్నారు. గ్రౌండింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. దళితుల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఖాతాలో నిధులు జమ చేయాలని డిమాండ్ చేశారు.

అంతకుముందు ఎస్సీ కార్పొరేషన్ సీఎండీ జనవరి 28న నిధులు విడుదల చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుల జిరాక్స్‌లను చూపించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రెండవ విడత దళితబంధు లబ్ధిదారులు

పౌర రక్షణ వలంటీర్ల నమోదుకు ఆహ్వానం

గణేశ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మై భారత్ యువతను పౌరరక్షణ వాలంటీర్లుగా నమోదు చేసుకోవాలని ఆహ్వానిస్తున్నట్లు మైభారత్ నెహ్రూ యువ కేంద్ర, జిల్లాయువజన అధికారి వెంకట రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, మై భారత్ దేశవ్యాప్తంగా యువతను భారత్‌పౌర రక్షణ వలంటీర్లుగా నమోదు చేసుకోవడానికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులు, సంక్షోభ సమయాల్లో కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. దేశానికి సేవ చేయాలనుకునే ఇందులో చేరడానికి ఆహ్వానం పలుకుతున్న పేర్కొన్నారు. వివరాలకు https://mybharat.gov.in, మై భారత్ నెహ్రూ యువ కేంద్రం, కరీంనగర్ జిల్లా, నంబర్లలో 9177329258, 0878-2243604 సంప్రదించాలని సూచించారు.

అంజన్న భక్తుల గిరిప్రదక్షిణ



కొండగట్టులో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మల్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌర్ణమి రోజు కొండగట్టు ఆంజనేయస్వామి గిరులచుట్టూ నిర్వహిస్తున్న గిరిప్రదక్షిణను సోమవారం నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంలోని శివాలయం ప్రధాన అర్చకులు సురేశ్ ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో 28వ సారి నిర్వహించిన ఈ గిరిప్రదిక్షణ నూతనంగా ఏర్పాటు చేసిన మార్గంలో సుమారు ఆరు కి.మీల మేర సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు దిగువ కొండగట్టులో పూజలు నిర్వహించి ప్రదక్షిణ ప్రారంభించారు. గిరి ప్రదక్షిణ ముగిసిన అనంతరం కొండపైన స్వామి వారిని దర్శించుకున్నారు.

19 నుంచి హోటల్ మేనేజ్‌మెంట్ సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ విభాగంలో బ్యాచిలర్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులో రెండో, ఆరో సెమిస్టర్ పరీక్షల ప్రణాళిక విడుదల చేశారు. ఈ నెల 19నుంచి 30వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. 2019 బ్యాచ్ బ్యాక్లాగ్ విద్యార్థులకు కూడా అవకాశం కల్పించినట్లు శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లోగానీ, ఆయా కళాశాలల్లోగానీ సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్ పార్సిల్స్ వేలం

భగత్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బస్టాండ్ లాజిస్టిక్స్ కౌంటర్‌లో 40 రోజుల పైబడిన పార్శిళ్లను వేలం వేయనున్నట్లు కరీంనగర్ లాజిస్టిక్స్ ఏటీఎం రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఉదయం 11 గంటలకు కరీంనగర్ బస్టాండ్ కౌంటర్‌లో వేలం ఉంటుందని పేర్కొన్నారు.

జేఎన్టీయూలో ప్రశాంతంగా ఈసెట్



పరీక్ష హాల్‌లోకి వెళుతున్న అభ్యర్థులు

రామగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఈసెట్ పరీక్షలు సోమవారం మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా ముగిసాయి. ఆన్‌లైన్ పద్ధతిలో ఉదయం జరిగిన పరీక్షలో 100 మంది విద్యార్థులకు ఐదుగురు గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



మామిడికాయ పచ్చడి సందడి



మామిడికాయలను ముక్కలుగా కొడుతున్న మహిళ

కరీంనగర్ కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో మామిడికాయ పచ్చడి సందడి నెలకొంది. పచ్చడికి అనువైన మాసాలు ఏప్రిల్, మే కాగా మే నెలలో తయారీకి ప్రాధాన్యమిస్తారు. కాయల నాణ్యత, పచ్చడి పెట్టే విధానాన్ని బట్టి రెండు సంవత్సరాల వరకూ నిలువ ఉంటుంది. అందుకే మామిడి పచ్చడిని ఏడాది గ్రాసంగా అభివర్ణిస్తారు. వేడి అన్నంలో పచ్చడి, నూనె లేదా నెయ్యి కలుపుకొని తింటే స్వర్గం కనిపిస్తోందని పచ్చడి ప్రియులు పేర్కొంటారు. గాలి వానలకు కాయలు రాలక ముందే కాయలు, వస్తువులు కొనుగోలు చేస్తూ పచ్చడి తయారీలో నిమగ్నమవుతున్నారు.



మామిడి కాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

● చుక్కలను చూపుతున్న ధరలు

● మామిడికాయల ధరలు...

మార్కెట్‌లో కాయలు రైతులు రాసులుగా పోశారు. పుల్లటి కాయకు గిరాకీ ఉండగా ఒక్కో కాయ సైజును బట్టి 6 నుంచి 15 రూపాయల వరకు అమ్ముతున్నారు. కాయ ఎంపికలో జాగ్రత్తపడక పోతే తొక్కు చెడిపోయే ప్రమాదం ఉంటుంది. గ్రామాల నుంచి మార్కెట్‌కు వచ్చిన పలువురు కాయలను కొడుతూ ఉపాధి పొందుతున్నారు. నీళ్లలో వేసి తుడిచి కొట్టేందుకు కాయకు ఐదు నుంచి ఎనిమిది రూపాయల వరకు తీసుకుంటున్నారు.

● ముడి వస్తువుల ధరలు

పచ్చడికి అవసరమైన వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. రిఫైండ్ ఆయిల్ ప్యాకెట్ 160, పల్లి నూనె ప్యాకెట్ 150, ఆవాలు, మెంతులు కిలోకి100, జీలకర్ర కిలో 300, శనగలు కిలో 80, ఉప్పు కిలో 20, కారం 250, ఇంగువ 50 రూపాయల వరకు పలుకుతున్నాయి.

● పచ్చడి తయారీ ఇలా...

బాణలో నూనెపోసి ఆవాలు, జీలకర్ర, మెంతులు (అలవాట్లను బట్టి అల్లం వెల్లుల్లి)వేసి పోపు పెట్టాలి. తగినంతగా కారం, ఉప్పు వేసి చల్లార్చుకోవాలి. తర్వాత మామిడి ముక్కలను కలపాలి. పోణిలో ఇంగువను వాడవచ్చు. పల్లీలు, జీడిని కూడా వేస్తారు. ఉప్పు ఆవకాయ పెట్టేవారు ఆవపొడి, పసుపు, ఉప్పు వేసి కలిపి పెట్టి ఒక రోజు తర్వాత పోపు పెట్టాలి. ముక్కలతో పాటు పోపు పెట్టిన కారాన్ని కల్పి జాడీలలోకి ఎత్తుకుంటే రెండు రోజుల తర్వాత ఊరుతుంది. పచ్చడి ఎంత ఊరితే అంత రుచి వస్తోంది.



● ఫటాఫట్

వానాకాలం సాగు ప్రణాళిక సిద్ధం

● సునీత, ఏడీఏ, హుజూరాబాద్



హుజూరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్రజ్యోతి: వానాకాలం సాగుకు ఎలాంటి ప్రణాళిక సిద్ధం చేశారు?

ఏడీఏ: ప్రణాళిక సిద్ధం చేశాం. విత్తనాలతోపాటు సుమారు 110వేల మెట్రిక్‌టన్నుల ఎరువులు అవసరమని ప్రతిపాదనలు పంపించాం.

ఆంధ్రజ్యోతి: పత్తి విత్తనాలు ఎప్పుడు విత్తుకోవాలి?

ఏడీఏ: జూన్ మొదటి వర్షానికే కాకుండా సమృద్ధిగా కురిసిన తర్వాత విత్తుకోవాలి.

ఆంధ్రజ్యోతి: వరి కొయ్యకాళ్లను కాల్చవచ్చా?

ఏడీఏ: కాల్చవద్దు. కాలిస్తే భూమిలో తేమ, నత్రజని దెబ్బతిని దిగుబడి రాదు.

ఆంధ్రజ్యోతి: జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయా?

ఏడీఏ: వారం రోజుల్లో అందుబాటులోకి వస్తాయి.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా మంగళవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఉదయం 7:30 నుంచి 10 వరకు బ్యాంక్ కాలనీ రోడ్ 1,4, ఎస్ఆర్ఆర్ కళాశాల ముందు ప్రాంతం, ఆర్టీసీ వర్క్‌షాప్, గౌడ హాస్టల్, మెహర్‌బాబా ఆలయ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

డంపింగ్ యార్డును తరలించాలి

సుభాష్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డును ప్రస్తుతం ఉన్నచోట నుంచి తరలించాలని కోతిరాంపూర్, అలకాపురికాలనీ, హౌసింగ్‌బోర్డు ప్రాంతవాసులు కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానేరు నది ఒడ్డున ఏర్పాటు చేసిన డంప్‌యార్డు నుంచి వచ్చే పొగ, వాసన భరించలేకపోతున్నామని, తీవ్రమైన అనారోగ్యాల పాలవుతున్నామని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగరంలోని 11వ డివిజన్ గౌతమ్ నగర్‌లో రూ.15 లక్షల సుడా నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. పద్మనగర్ బైపాస్ రోడ్డు సమీపంలోని ఈ కాలనీ వర్షాకాలం ముంపునకు గురవుతోందని, బురదమయం అవుతోందని స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. వర్షాకాలం ప్రారంభంలోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామన్నారు. మాజీ కార్పొరేటర్ ఆకుల నర్మదనర్సన్న, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నెల్లి నరేష్, పిట్టల లింగన్న, వడ్లకొండ సంపత్, చంద్రయ్య, అంజయ్య, మున్నక్క, విజయ, డీఈ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

యజ్ఞ వరాహక్షేత్రంలో అభిషేకం



అభిషేకం చేస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, మే 12(ఆంధ్రజ్యోతి): వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం నగరంలోని యజ్ఞ వరాహక్షేత్రంలో స్వామివారికి విశేష అభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్వవైదిక సంస్థానం ట్రస్టు మేనే జింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎవరు?

(5వ పేజీ తరువాయి)

ఉండవచ్చని ఈ పదవి కోసం అందరూ ప్రయత్నిస్తున్నారు. రాజేందర్‌రావుకు మద్దతుగా మాజీ కార్పొరేటర్లతోపాటు మరికొందరు ఇప్పటికే డీసీసీ అధ్యక్ష పదవి అప్పగించాలని కోరడం కోసం గాంధీభవన్‌కు వెళ్లారు. ప్రస్తుతం ఆయన నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలతో ఫోన్‌లో మాట్లాడుతూ తాను ఇన్‌చార్జి పదవి కోసం ప్రయత్నిస్తున్నానని, మద్దతు ఇవ్వాలని కోరుతున్నారని ప్రచారం జరుగుతున్నది. మరోవైపు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రి శ్రీధర్‌బాబు, ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేల మద్దతు ఉన్నట్లుగా చెబుతున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించవచ్చనే ప్రచారం జరుగుతున్నది. ఈ ఇద్దరు నేతల ప్రచారం చూసిన పాత కాంగ్రెస్ నేతలు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. వీరికి మద్దతు ప్రకటిస్తున్న మాజీ కార్పొరేటర్లందరు ఇతర పార్టీలకు వెళ్లి ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరిన పారాచూట్ నేతలని, వారిని విశ్వాసంలోకి తీసుకుని, పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీని పట్టుకుని ఉన్న తమలాంటి వారిని విస్మరిస్తున్నారని పాత సీనియర్ నేతలందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు జెండా మోసి, ఎన్నికల్లో ఓట్లేయించిన వాళ్లమైన విస్మరించడం ఏమిటని అసంతృప్తిగా ఉన్నారు. వీరంతా రెండు రోజుల క్రితం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని కలిసి తమ ఆవేదనను తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుని దృష్టికి, ఇతర ముఖ్యుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి సీనియర్ కాంగ్రెస్ నేతలకు న్యాయం చేయాలని కోరితే ఆయన వారికి పార్టీ నాయకత్వం సరైన నిర్ణయం తీసుకుంటుందని కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని నచ్చజెప్పినట్లు సమాచారం. వారు దాంతో సంతృప్తిచెందక గాంధీభవన్‌కు వెళ్లి తమ గోడు వెళ్లబోసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, జిల్లా ఇంచార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లను కలిసి ఈ వ్యవహారంలో తమకు న్యాయం చేయాలని కోరాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

నర్సుల సేవలు ఆదర్శనీయం



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ సత్యనారాయణరెడ్డి

సుభాష్‌నగర్, మే (ఆంధ్రజ్యోతి)12: పేషంట్‌కు అందించే చికిత్సలో నర్సుల సేవలు ఆదర్శనీయమని ఆదర్శ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కరివెద సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఆసుపత్రిలో ప్రపంచ నర్సింగ్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేషంట్ త్వరగా కోలుకోవడంలో డాక్టర్‌తోపాటు నర్సింగ్ సేవలు చాలా ముఖ్యమన్నారు. నర్సుల సేవలతోనూ ఆసుపత్రులకు పేరు వస్తుందన్నారు. వారి సేవలు ఆదర్శనీయమని, అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు నర్సులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మానసతేజస్విని, డాక్టర్ అనూష, డాక్టర్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు



కేక్ కట్ చేస్తున్న సీఐ శ్రీలత, నర్సులు

సుభాష్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పని చేస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ శ్రీలత అన్నారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. నర్సింగ్ ఉద్యోగం రిస్క్‌తో కూడుకున్నదని, చిత్తశుద్ధితో పనిచేస్తూ ధైర్యం, నమ్మకం కల్పించాలని అన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన నర్సులకు జ్ఞాపికలను అందజేశారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, డాక్టర్ వినయ్, డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, డాక్టర్ నాగరాజు, డాక్టర్ లోకేష్, డాక్టర్ రాంచందర్, డాక్టర్ దిలీప్‌రెడ్డి, సూపరిం టెండెంట్ డాక్టర్ రవిమల్లారెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, మే 12(ఆంధ్రజ్యోతి): తమను లంచం అడిగిన తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు తహసీల్దారు పేరుతో ముద్రించిన టీషర్టులు వేసుకొని సోమవారం ప్రజావాణికి వచ్చారు. బాధితురాలు చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన బోయిని దేవేంద్ర మాట్లాడుతూ 2013లో గ్రామ శివారులో 215 సర్వే నంబరులో 28 గుంటల భూమిని ప్రభుత్వం తనపేరున పట్టా చేసిందని తెలిపింది. దీనికి సంబంధించి 2024లో చిగురుమామిడి తహసీల్దారు రమేశ్ తన కొడుకును పిలిచి పట్టా రద్దు చేయకుండా ఉండాలంటే రూ.5 లక్షలు ఇవ్వాలని అడిగారని ఆరోపించింది. ఈ విషయమై ఇదివరకు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా బెదిరింపులకు గురిచేస్తున్నాడని, తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది.

సాహితీ వారధి ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో అమూల్య సాహితీ వారసత్వాన్ని, కొత్తదనాన్ని అదించేందుకు ఎన్నీల ముచ్చట్లు ఒక వారధిలా పనిచేస్తున్నాయని కథాచరయిత, ప్యానల్ గ్రేడ్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ బీవీఎన్ స్వామి అన్నారు. తెరవే ఆధ్వర్యంలో సోమవారం రాంనగర్‌లోని ఆయన నివాసంలో 145వ ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు పహల్గాం మృతులకు మౌనం పాటించారు. జిల్లా అధ్యక్షుడు సీవి కుమార్, సీఎస్ రవీంద్ర, అన్నవరం దేవేందర్, గాజోజు నాగభూషణం,అంజయ్య, ఇటిక్యాల రాము, రవిందర్, ప్రవీణ్, ఖాలిద్ తదితరులు పాల్గొన్నారు.

'సే నో డ్రగ్స్' పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): సివిల్ ప్రొటెక్షన్ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో రూపొందించిన 'సే నో డ్రగ్స్' పోస్టర్‌ను సోమవారం కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఆవిష్కరించారు. డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు సీఐ తెలిపారు. విద్యాసంస్థలు తెరిచిన తరువాత కళాశాలల్లో డ్రగ్స్‌పై సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలను చేపడతామన్నారు.

నేటి నుంచి పౌరాణిక పద్యనాటకాల ప్రదర్శన

కరీంనగర్ కల్చరల్, మే 12 (ఆంధ్రజ్యోతి) : కళాభారతిలో మంగళ, బుధ గురు వారాల్లో సాయంత్రం 6-30 గంటల నుంచి పౌరాణిక పద్యనాటకాలను ప్రదర్శించనున్నారు. భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమి, టీవీ, చలనచిత్ర, నాటక రంగ అభివృద్ధి సంస్థ సంయుక్త సౌజన్యంతో మన సమైక్యత కల్చరల్ అకాడమి సారథ్యంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు రొడ్డ యాదగిరి, ఆగస్టీన్ తెలిపారు. తొలి రోజు శ్రీసాయి సంతోషి నాట్య మండలి సురభి వారి మయాబజార్, రెండో రోజు బాల నాగమ్మ, మూడో రోజు షిరిడీ సాయి బాబా జీవిత చరిత్ర నాటకాలు ఉంటాయని పేర్కొన్నారు.

మంత్రి పొన్నం చొరవతో నిధులు మంజూరు

కరీంనగర్ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం పెద్ద చెరువు కింద వైపు కాలువ నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.18.80లక్షల నిధులు మంజూరు చేయించారని మాజీ సర్పంచ్ పెంచాల లక్ష్మణ్ రావు ప్రకటనలో తెలిపారు. ఆదివారం కాలువ పనుల ప్రారంభంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నిధులు మంజూరు చేయించారని బీఆర్ఎస్ నాయకులు అనడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు.

శిశు మందిర్‌లో సరస్వతీ హవనం

కరీంనగర్ కల్చరల్, మే 12(ఆంధ్రజ్యోతి): వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం నగరంలోని సరస్వతీ శిశు మందిర్‌లో సరస్వతీ హోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సముద్రాల రాజమౌళి, పాఠశాల కార్యదర్శి కోల అన్నారెడ్డి, పులాల శ్యామ్, డాక్టర్ సత్య విద్యాసాగర్, సమితి అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చామనపల్లి పీహెచ్‌సీలో సాధారణ ప్రసవం

కరీంనగర్ రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం చెర్లభూత్కూర్‌కు చెందిన కౌసల్యకు సాధారణ ప్రసవం చేశారు. ఆడపిల్లకు జన్మనిచ్చినట్లు, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యుడు మనోహర్ తెలిపారు. వైద్య సిబ్బంది స్వరూప, శైలజ, విమల, జమున, తదితరులు ఉన్నారు.

హోంగార్డు కార్యాలయం తనిఖీ

కరీంనగర్ క్రైం, మే 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హోంగార్డు కార్యాలయాన్ని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని, ఎప్పటికప్పుడు నవీకరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, విధులపై అడిగి తెలుసుకున్నారు. అంకిత భావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు.



వివరాలు తెలుసుకుంటున్న సీపీ గౌస్ ఆలం

15 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో 15న ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభించనున్నారు. 16న ఉదయం 6 నుంచి 17 క్రీడాంశాల్లో శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, క్రికెట్, చెస్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ, జూడో, కబడ్డీ, కరాటే, సాఫ్ట్‌బాల్, వాలీబాల్, యోగా, రెజ్లింగ్, బాక్సింగ్ క్రీడాంశాల్లో నిర్వహించనున్న ఉచిత వేసవి శిబిరాల్లో 6 నుంచి 18 సంవత్సరాల్లోపు విద్యార్థులు పాల్గొనవచ్చని సూచించారు. 13న సాయంత్రం 5 గంటలలోపు ఫొటో, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో స్టేడియంలోని కార్యాలయంలో దరఖాస్తు అందించాలని పేర్కొన్నారు.

రైతులకు వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేయాలి



తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి, మే 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన వాగ్దానాల మేరకు వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ జాతీయకార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయన రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 40శాతం రైతులకు రుణ మాఫీ కాలేదని ఒక్క చిగురుమామిడి మండలానికి సంబంధించి 3724 మంది రైతులకు రుణమాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గన్నేరువరం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేరువరం, మైలారం, ఖాసింపేట, పారువెల్ల, చొక్కారావుపల్లి, చాకలివానిపల్లి గ్రామాలకు మంగళవారం ఉదయం 9నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌లైన్‌ల కింద పెరిగిన చెట్లను తొలగించే క్రమంలో విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ఆయాగ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి శకటోత్సవం

మానకొండూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శకటోత్సవం జరిగింది. గ్రామంలోని రైతులు ఎడ్లబండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ నెల 14న స్వామి వారి రథోత్సవం, జాతర జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సుందరగిరిలో...

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఆలయ చైర్మన్ చొల్లేటి శంకరయ్య పట్టువస్త్రాలు అందజేశారు. కల్యాణం వీక్షించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

ఘనంగా గౌతమ బుద్ధుడి జయంతి

హుజూరాబాద్/చొప్పదండి, మే 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్, చొప్పదండిలో గౌతమ బుద్ధుడి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. గౌతమబుద్ధుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రత్నం, ప్రకాష్, రాజు, తిరుపతి, శేఖర్, సంపత్, ప్రభాకర్, భాస్కర్, చొప్పదండిలో అంబేద్కర్‌యువజనసంఘం మండలశాఖ అధ్యక్షుడు కడారి గంగరాజు, పట్టణఅధ్యక్షుడు వడ్లూరి శ్రీనివాస్, కల్లెపల్లి రత్నం, జంగం అంజన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఖబ్రస్థాన్‌కు కేటాయించిన భూమిని భూభారతిలో చేర్చాలి

హుజూరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పరిధి బోర్నపల్లి శివారులో ముస్లింలకు ఖబ్రస్థాన్ కొరకు ప్రభుత్వం కేటాయించిన భూమిని భూభారతిలో నమోదు చేయాలని జామేమసీద్ ఈద్గాఅండ్‌ఖబ్రస్థాన్ మేనేజ్‌మెంట్‌కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ సోమవారం ఆర్డీవో రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 196, 198లలో బోర్నపల్లి శివారులోని ఎస్సారెస్పీ కెనాల్‌పక్కన ఎకరం 10గుంటల భూమిని ఖబ్రస్థాన్‌కు కేటాయించారన్నారు. భూమిని కొలతలు చేసి హద్దులు చూపెట్టాలన్నారు.

రైతులు యూరియా వాడకం తగ్గించాలి

● జిల్లా వ్యవసాయ అధికారి జయ భాగ్యలక్ష్మి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి జయ భాగ్యలక్ష్మి

గన్నేరువరం, మే 12 (ఆంధ్రజ్యోతి): యూరియా వాడకాన్ని తగ్గించాలని జిల్లా వ్యవసాయ అధికారి జయ భాగ్యలక్ష్మి రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని ఖాసింపేట రైతువేదికలో ఏవో కిరణ్మయి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. కరీంనగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం వారు మొక్కజొన్న పరిశోధన కేంద్రం లుధియానా సహకారంతో ఖాసింపేట, పారువెల్ల గ్రామాలలోని 250మందిరైతులకు మొక్కజొన్న విత్తనాలు, గడ్డిమందులను పంపిణీ చేశారు. మేలైన విత్తనాలను వాడుతూ శాస్త్రవేత్తలు సూచనల ప్రకారం అధికారుల సిఫారసు మేరకు యూరియాను వాడుతూ భూసారాన్ని పెంచాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనకేంద్రం అధికారి ఉషారాణి, శాస్త్రవేత్త శ్రావణి, ఏవో కిరణ్మయి, ఏఈవో అనూష, రైతులు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతం కోసం ప్రతికార్యకర్త కృషిచేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లాకార్యదర్శి మర్రి వెంకటస్వామి

రామడుగు, మే 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీపీఐ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని సీపీఐ జిల్లాకార్యదర్శి వెంకటస్వామి పిలుపునిచ్చారు. సోమవారం మండల మహాసభ గోపాల్‌రావుపేటలో మచ్చ రమేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని లేకుంటే ప్రజాఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ మండల కార్య దర్శి గొడిశాల తిరుపతిగౌడ్, జిల్లా కౌన్సిల్‌సభ్యులు మచ్చ రమేష్, ఉమ్మెంతల రవీందర్ రెడ్డి, మండల నాయకులు ఎగుర్ల మల్లేశం, శంకరయ్య, లక్ష్మి, నర్సయ్య, ఐలయ్య, రాజేష్, అజీమ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్లకు సంఘీభావంగా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న హనుమాన్ దీక్షాపరులు

హుజూరాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం ఆర్మీకి సంఘీభావంగా హనుమాన్‌దీక్షాపరులు ర్యాలీ నిర్వహించారు. రెండునిమిషాలు మౌనంపాటించారు. వీరమరణం పొందిన జవాన్లకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో హనుమాన్ దీక్షాపరులు రామకృష్ణస్వామి, రాజశేఖర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కర్రలతో బావి చుట్టూ రక్షణ కంచె



కంచెను ఏర్పాటు చేస్తున్న జీపీ సిబ్బంది

గన్నేరువరం, మే 12 (ఆంధ్రజ్యోతి): గునుకుల కొండాపూర్‌లో మంగళవారం రేణుకాఎల్లమ్మ జాతర ఉన్నందున గ్రామ శివారులో రోడ్డువెంబడి ప్రమాదకరంగా ఉన్న రెండుబావుల వద్ద గ్రామపంచా యతీ సిబ్బంది కర్రలతో కంచెను ఏర్పాటు చేసి తాత్కాలిక రక్షణ కల్పించారు. గతంలో గుండ్లపల్లి నుంచి గునుకుల కొండాపూర్ వరకు డబుల్‌రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్ రోడ్డుపక్కన ఉన్న బావుల వద్ద ఎలాంటి రక్షణ గోడలు నిర్మించలేదు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న బావుల చుట్టూ శాశ్వత రక్షణ గోడలు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



చిలుము పట్టి వంగిన స్తంభం

జమ్మికుంట రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలో రోడ్డు పక్కనే ఇనుప విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. స్తంభం కింది భాగంలో పూర్తిగా చిలుముపట్టి ఒకవైపు వంగింది. ఎప్పుడు కింద పడుతుందో అన్నట్లుగా కనిపిస్తోంది. అతేకాకుండా స్థంభానికి అమర్చిన మీటర్‌కు కనీసం పైకప్పు కూడా లేదు. దీంతో విద్యుత్ వైర్లు ఇనుపస్థంభానికి అల్లుకొని ఉన్నాయి. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి తక్షణమే నూతన స్తంభం ఏర్పాటు చేయాలని, మీటర్‌కు రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అపరిశుభ్రంగా ఆర్టీసీ బస్టాండ్



పేరుకు పోయిన చెత్త

జమ్మికుంట, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీబస్టాండ్ ఆవరణ చెత్త, చెదారంతో నిండిపోయింది. చెట్లకొమ్మలతోపాటు ప్రయాణికులు తినిపడేసిన కవర్లు, పేపర్లు, సమీప దుకాణదారులు వేసిన చెత్త, చెదారం బస్టాండ్‌లో పేరుకుపోయింది. ఆర్టీసీ, మున్సిపల్ సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడంతో చెత్తపేరుకుపోయి దుర్గంధం వెద జల్లుతోందని ప్రయాణికులు వాపోతున్నారు.

ప్రతి పౌరుడు దేశరక్షణ కోసం కట్టుబడి ఉండాలి: సీఐ

జమ్మికుంట రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడు దేశ రక్షణ కోసం కట్టుబడి ఉండాలని పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ అన్నారు. సోమవారం జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో శాంతికమిటీ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న సంఘటనలకు సంబంధించి కులమతాలకు అతీతంగా అందరు దేశరక్షణకు పాటు పడాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్యప్రచారాలను నమ్మవద్దని కోరారు.

అవీ.. ఇవీ..

జమ్మికుంట: పట్టణంలోని శివాలయంలో భారత త్రివిధదళాల క్షేమం కోసం అన్నపూర్ణ సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం 108లీటర్లపాలు, 108కొబ్బరికాయలతో పూజలు నిర్వహించారు. భక్తులకుతీర్థ ప్రసాదాలు అందజేశారు.

హుజూరాబాద్: పట్టణంలోని శ్రీరామ ఆస్పత్రిలో సోమవారం నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నర్సులతో కేక్‌కట్ చేయించి స్వీట్లు పంపిణీ చేశారు.

-హుజూరాబాద్ పట్టణ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొమురవెల్లి హరిప్రసాద్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మండల యాదగిరి, కోశాధికారిగా సీహెచ్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లను ఎన్నుకున్నారు.

-ప్రైవేట్‌పాఠశాలలకు తొత్తుగా వ్యవహరిస్తున్న ఎంఈవోను సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ మండలకార్యదర్శి రోహిత్ అన్నారు. సోమవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్‌పాఠశాలలు విద్యావ్యాపారం చేస్తున్నాయన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ అరికట్టకుండా ఎంఈవోవారికి వత్తాసు పలుకు తున్నాడన్నారు.

సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లి జడ్పీ ఉన్నతపాఠశాలలో ఏఐఎఫ్, అమెజాన్ వారిసౌజన్యంతో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను సోమవారం ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు.

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ చొల్లేటి శంకరయ్యతో పాటు డైరెక్టర్లు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ కమిటీ సభ్యులుగా గందె రాజయ్య, పూల లచ్చిరెడ్డి, బూర వీరేశం, దుబ్బాల శ్రీనివాస్, జీలసంపత్, ఎలగందుల శారద, ప్రమాణ స్వీకారం చేశారు.

కరీంనగర్ టౌన్: నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం నిర్వహించిన అప్రెంటిస్‌షిప్‌మేళాకు స్పందన లభించింది. హైదరాబాద్‌కు చెందిన ఆజాద్ ఇంజనీరింగ్‌లిమిటెడ్, రానేఇంజన్‌వాల్వ్స్, వరుణ్‌మోటార్స్‌లో ఉద్యోగాలకు 25మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కరీంనగర్ కల్చరల్: హనుమకొండకు చెందిన ఉపాధ్యాయుడు డాక్టర్ మడత భాస్కర్ 'అమ్మకు ప్రేమతో' అనే బృహత్ లేఖా సంకలనాన్ని విడుదల చేయనున్న సందర్భంలో నిర్వహించిన పోటీలో కరీంనగర్‌కు చెందిన ఎల్ఐసీ ఉద్యోగి నామని సుజనాదేవి ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు.